

పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

మహిళలు విధులు నిర్వహించే ప్రదేశాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి. మహిళా ఉద్యోగులపై ఎవరైనా దాడి చేయాలంటే భయపడే పరిస్థితి కల్పించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకోవాలి.

– యూజీ విజయకుమారి, హెడ్ నర్స్, కేజీహెచ్



రక్షణ చట్టం అమలు చేయాలి

వైద్యులు, నర్సుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేస్తామని కేంద్రం ప్రకటించినప్పటికీ అమలు చేయలేదు. కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రత్యేక చట్టం అవసరం. బాల బాలికలకు విద్యార్థి దశ నుంచి నైతిక విలువలతో కూడిన విద్య అందించాలి. ఆస్పత్రుల్లో రక్షణ పెంచాలి. తక్షణమే నిందితులను శిక్షించాలి.

– టి.పద్మజ, స్టాఫ్‌నర్స్, కేజీహెచ్



క్లుప్తంగా

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: సేవామూర్తి మదర్ థెరిసా జయంతి సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గల ఐల్యాండ్‌లోని థెరిసా, బుద్ధుడి విగ్రహానికి జనసేన పార్టీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్ థెరిసా మన మధ్య లేనప్పటికీ ఆమె సేవా గుణాన్ని నేటితరం అలవరచుకోవాలని పిలుపునిచ్చారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం



ఏయూటీడీ వసతి గృహానికి మహిళను అప్పగిస్తున్న ఆరిలోవ పోలీసులు

ఆరిలోవ: అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని ఓ మహిళను ఆరిలోవ పోలీసులు నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదివారం రాత్రి పోలీస్ కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాలు, బీచ్ రోడ్డులో పర్యటించారు. అర్ధరాత్రి దాటి 2 గంటల సమయంలో జోడుగుళ్లపాలెం వద్ద రోడ్డుపై వర్షంలో తడుస్తూ మతిస్థిమితం లేని ఓ మహిళను ఆయన గుర్తించారు. వెంటనే వాహనం ఆపి మహిళను పరిశీలించారు. ఆమె మాట్లాడలేకపోవడం, సరిగా సమాధానం చెప్పలేకపోవడంతో సిబ్బందితో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆ మహిళకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆరిలోవ పోలీసులు మహిళా సిబ్బందితో వెళ్లి జోడుగుళ్లపాలెంలోని అవుట్‌పోస్టుకు ఆమెను తరలించారు. అనంతరం ఆ మహిళను ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న వసతి గ్రహంలో ఆమెను చేర్పించారు.

మొక్కలతో పర్యావరణానికి మేలు



మత్స్యకార పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెం ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో ద్వారకానగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. డౌన్ టు డస్క్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటారు. మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం ద్వారా కాలుష్య రహిత వాతావరణానికి విద్యార్థులు బాటలు వేయాలని సూచించారు.

19 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో రైల్వే భద్రతా దళం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.కీర్తిరెడ్డి సిబ్బందితో సోమవారం తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఢిల్లీకి చెందిన షాకిబ్ అలీ, ముంబయికి చెందిన శంకర్ తెవతియా బిశ్వాల్ వద్ద గంజాయి గుర్తించారు. వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీ, ముంబయికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావుకు అప్పగించారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

అధ్వానంగా చావుల మదుము మార్గం



చావుల మదుము రోడ్డులో వర్షపు నీటితో నిండిన గోతులు



అధ్వానంగా చావుల మదుము వంతెన కింద మార్గం

- ఇక్కడి వంతెన కింద నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు
- గోతులతో ప్రమాదకరంగా రహదారి
- చీకట్లో గోతుల్లో పడుతున్న వాహనదారులు

కంచరపాలెం: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే చావుల మదుము వంతెన మార్గం గోతుల మయం కావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకటి పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంటు కూడలి చావుల మదుము రైల్వే వంతెన దిగువ రహదారి గోతులతో అధ్వానంగా మారింది. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, విశాఖ రైల్వే స్టేషన్ నుంచి పారిశ్రామిక ప్రాంతం గాజువాక, సింధియా, డాక్‌యార్డ్, పోర్టు ఎస్సార్ ప్రాంతాలు, అటు సింహాచలం, పెందుర్తి జ్ఞానాపురం రైల్వేస్టేషన్ నుంచి జగదాంబ, పూర్ణా మార్కెట్‌కు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇటుగా నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణ సమయంలో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు గోతులు చూసుకుని రాకపోకలు సాగిస్తున్నా... వర్షం కురిసినప్పుడు గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. జీ – 20 సదస్సు నిర్వహణ సమయంలో వంతెన రహదారిలో విద్యుత్ లైట్లు, వంతెన గోడలకు రంగులు, బీటీ రహదారులు వేసి అందంగా మార్చారు. అనంతరం నిర్వహణ సరిగా లేకపోవడంతో వంతెన రహదారి పరిసరాలు అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి సమస్యలపై జోనల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, రహదారిపై గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నాం

చావుల మదుము వంతెన దిగువ రహదారి గోతుల మయం కావడంతో అటుగా ప్రయాణం చేయలేక పోతున్నాం. వర్షపు నీరు గోతుల్లో చేరితే ప్రమాదాలకు గురవుతున్నాం. గోతులు పూడ్చి రహదారులు వేయమని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. చీకటి పడితే లైట్లు లేకపోవడంతో వంతెన కింద మరీ ప్రమాదకరంగా ఉంటుంది.

– కుమార్, వాహనదారుడు, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

కాన్వెంటు కూడలి రహదారిలో బీటీ రోడ్డు ప్రమాదభరితంగా మారాయి. నిత్యం అటుగా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల నుంచి తప్పించుకుని ప్రయాణం సాగిస్తున్నారు. కొత్తగా అటుగా ప్రయాణించే వారు మాత్రం జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చి లైట్లు ఏర్పాటు చేయాలి.

– బోరా మహేంద్ర, జ్ఞానాపురం

పెన్షన్ చెల్లింపులో అసమానతలు తొలగించాలి



విశాఖ జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ప్రారంభ సమావేశం సోమవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు బీవీవీ కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎల్లారావు మాట్లాడుతూ పెన్షన్ సవరణ, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గింపు, ఫ్యామిలీ పెన్షన్ పెంపుదల, కనీస పెన్షన్ పెంపుదల, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తొలగింపు, దేశ వ్యాప్తంగా గల 6 లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ చెల్లింపులు ఉద్యోగు సంక్షేమ నిధి నుంచి కాకుండా సంబంధిత బ్యాంకులే స్వయంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌బీఐ విశ్రాంత ఉద్యోగులతో సమానంగా పెన్షన్ చెల్లించాలని, పెన్షన్ చెల్లింపులో అసమానతలు తొలగించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ విశ్రాంత ఉద్యోగ సమాఖ్య సంయుక్త కార్యదర్శులు పి.వీరారెడ్డి, వి.జగన్మోహనరావు, జి.రామచంద్రరావు, ఆర్‌పీ రవికుమార్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడిగా ఎ.కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పీ రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.కేశవరావు, జి.రామచంద్రరావు, పి రాఘవరావు, ఎంఎస్ భాస్కరరావు, సాగర్, కోశాధికారిగా పి.మృత్యుంజయరావుతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలి.

22వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు సోమవారం నాటికి 22వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా.. ముకుందా మురారీ

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణ చైతన్య మఠంలో అంబరాన్నంటిన సంబరాలు



కుసుమహరనాథ ఆశ్రమంలో గోపాలుడు



చిన్నికృష్ణుడు



స్వామి వివేకానంద సంస్థ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



శ్రీకృష్ణుడి విగ్రహంతో తిరువీధి నిర్వహిస్తున్న గౌరీ మహిళా మండలి సభ్యులు

డాబాగార్డెన్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు రాధా కృష్ణుల వేషధారణల్లో అలంరించారు. మహారాణిపేట జిల్లా పరిషత్ సమీపాన గల కృష్ణచైతన్య మఠంలో కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పసిపిల్లల పాదాలకు పారాణి రాసి అడుగులతో ఇళ్లల్లోకి నడిపించి, చిన్నికృష్ణుని ఆహ్వానించినట్టు చేశారు. అల్లిపురం, కోటవీధి, చెంగల్రావుపేట, మహారాణిపేట, డాబాగార్డెన్స్, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో సాయంత్రం ఉట్టి సంబరం సందడిగా నిర్వహించారు. పాతజైల్ రోడ్డు కృష్ణుడి మందిరం వద్ద నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

108 పిండివంటలతో నైవేద్యం..

పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కోలాహలంగా జరిగాయి. గోపూజతో కార్యక్రమాలు చేపట్టారు. 108 రకాల పిండివంటలతో స్వామికి నైవేద్యం సమర్పించారు. పలువురు ప్రముఖులు పూజలో పాల్గొన్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. మూడు రోజుల పాటు స్వామి ప్రసాదం పంపిణీ చేస్తామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, పలువురు సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

- 29వ వార్డులోని రామజోగిపేట యూత్, ఉటగెడ్డ శ్రీకృష్ణ యాదవ సంఘం, కలెక్టరేట్ జంక్షన్ శ్రీదుర్గ గణపతి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల వాసు, జనసేన పార్టీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు.
- కుసుమహరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ అభిన్న స్వరూపులు కుసుమ హరనాథుల దివ్యమూర్తులకు నూతన వస్త్రాలు, పూల మాలలతో అలంకరించి, బాల గోపాలుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఆశ్రమ అధ్యక్షుడు బి.వి.బాబాజీ, కార్యదర్శి ఆర్.వి.ఎస్.రమేష్, సంయుక్త కార్యదర్శి కె.మంగరాజు, ఆశ్రమ ప్రతినిధులు బి.శివసీతారాం, నానికృష్ణ, పి.సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘంలో.

పాతనగరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం సంబరాల్లో భాగంగా 12 ఏళ్లలోపు బాల బాలికలచే కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముద్దులొలుకే గోపికలతో అల్లరి కృష్ణయ్య అనే పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. చిన్నారులచే ఉట్టి కొట్టించడం, చిన్నికృష్ణుడు, రాధ, గోపికలు వేషధారణ పోటీలు, చిన్నారి కృష్ణుల చిలిపి పనులు వంటి కార్యక్రమాలు ఉత్సాహ భరితంగా సాగాయి. సుమారు 45 మంది చిన్నారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బత్తుల జయశ్రీ, మాదేటి జ్యోతి, వి.గీత, వి.సుజన, పి.అనిత, సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు, కార్యదర్శి కె.ఎస్.రామారావు, కోశాధికారి పి.వి.ఎస్.ఎన్.వి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ప్రతిమలతో తిరువీధి

అల్లిపురం: అల్లిపురం పరిసర ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వెంకటేశ్వర మెట్ట, శ్రీ గౌరీ మహిళా మండలి ఆధ్వర్యంలో సభ్యులు తిరునామధారులై జై శ్రీకృష్ణ అంటూ శ్రీకృష్ణుడి ప్రతిమతో వీధుల్లో తిరుగుతూ అలరించారు. శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఉంచి పూజలు, భజనలు నిర్వహించారు. సాయంత్రం పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు.

- టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో శ్రీకృష్ణుడి మూలవిరాట్టుకు ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

అలరించిన వేషధారణ పోటీలు

మహారాణిపేట: కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలు అలరించాయి. శిష్టా సాయిపూజిత, శిష్టా దుతి, మల్లవరపు సాయి అముక్త వేసిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి చికిత్సాలయం డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, డాక్టర్ లక్ష్మీనారాయణ, జయంతి శేష అన్నపూర్ణ, వై.లక్ష్మణరావు, రమణమ్మ, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





గోపికల వేషధారణలో చిన్నారులు



కృష్ణాష్టమి పోటీల్లో విజేతలైన చిన్నారులతో ఆర్యవైశ్య సంఘ సభ్యులు

చిన్నికృష్ణుల సందడి

- అల్లిపురంలో కళకళలాడిన డ్రామా డ్రెస్ కంపెనీలు



చిన్నారిని శ్రీకృష్ణుడిగా తీర్చిదిద్దుతున్న కళాకారుడు

అల్లిపురం: కృష్ణాష్టమి సందర్భంగా అల్లిపురంలో చిన్నికృష్ణులు సందడి చేశారు. సూర్యోదయం నుంచి అల్లిపురం మెయిన్ రోడ్డులోని శ్రీ శారదా డ్రామా డ్రెస్ కంపెనీతోపాటు మరో డ్రామా డ్రెస్ కంపెనీకి పలువురు కృష్ణుడి వేషధారణ నిమిత్తం క్యూ కట్టారు. దీంతో కళాకారులకు చేతినిండా పనిదొరికనట్లయింది. గతంలో కంటే ఈ ఏడాది తక్కువగానే ఉందని శారదా డ్రామా డ్రెస్ కంపెనీ ఓనర్ కనకరాజు తెలిపారు. కృష్ణాష్టమికి ముందు రోజు ఆదివారం కావడం.. స్కూళ్లకు సెలవు కావటంతో ఒక రోజు మాత్రమే కార్యక్రమాలు చేపట్టామని,, గతంలో రెండు రోజుల పాటు పని ఉండేదన్నారు. నాలుగు నెలలుగా ఎటువంటి పనిలేకుండా ఉన్నామని, మొత్తం మీద కృష్ణాష్టమి సందర్భంగా ఒక రోజైనా పని దొరికిందని కళాకారులు ఆనందం వ్యక్తం చేశారు.



స్కూటీపై వెళ్తున్న చిన్నికృష్ణ వేషధారి

క్రీడలతో మానసిక ఉల్లాసం



స్పోర్ట్స్ మీట్‌లో షటిల్ ఆడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఉద్యోగులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్లాడుతూ ఉద్యోగులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి ఇటువంటి స్పోర్ట్స్ మీట్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శాంతి స్వరూప్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, వీకేసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి

సీతమ్మధార: ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని, సెప్టెంబర్ 3న విశాఖలో నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కృష్ణానగర్‌లో కల్వర్టుపై ధ్వంసమైన ఇనుప గ్రిల్స్
- సమస్యను పట్టించుకోని అధికారులు



నెల రోజుల కిందట ఇలా ప్రమాదకరంగా..

డాబాగార్డెన్స్: ఎటు చూసినా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. అధికారులకు పట్టడం లేదు. ప్రజాప్రతినిధులు అసలే పట్టించుకోరు. వార్డుల్లో ఎక్కడ ఏ సమస్య ఉందో వారికే తెలియదు. కార్పొరేటర్లు వార్డుల్లో పర్యటించలేదనడానికి.. ఈ చిత్రాలే నిదర్శనం. జీవీఎంసీ 29వ వార్డు కృష్ణానగర్ మలేరియా విభాగ కార్యాలయం వద్ద నెల రోజులుగా కల్వర్టుపై ఉన్న ఇనుప పలక తుప్పుపట్టి విరిగింది. నిన్నా.. మొన్నటి వరకు ఇటుగా వెళ్తే ప్రమాదముందని హెచ్చరిస్తూ ఓ చెట్టును స్థానికులు ఏర్పాటు చేశారు. అది కాస్తా ఊడిపడింది. ప్రస్తుతం పెద్ద గొయ్యిలా ఏర్పడింది. వాహన చోదకులు, పాదాచారులు ఆదమరిస్తే అంతే మరి. రాత్రి వేళల్లో ద్విచక్ర/త్రిచక్ర వాహనదారులు ఇటుగా వెళ్లి ఆ గొయ్యిలో పడితే అంతే. సమస్య చిన్నదైనా.. ప్రమాదం పెద్దది కావచ్చు. ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందికి ఇది ఏమంత పెద్ద సమస్య కానట్లు వ్యవహరిస్తున్నారో.. ఏమో తెలియదు గాని.. ప్రమాదం మాత్రం పొంచి ఉంది. కనీసం ఈ కల్వర్టుకు ఎదురుగా ఉన్న మలేరియా కార్యాలయ సిబ్బంది కూడా దీనిని పట్టించుకోకపోవడం శోచనీయమే. ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరాతున్నారు.



ప్రస్తుతం ఇనుప గ్రిల్ పరిస్థితి ఇదీ...



ప్రమాదకరంగా ఇనుప గ్రిల్స్